అటవీ అమరవీరులకు ఘన నివాళి

విశాలాంధ్ర - అనకాపల్లి: అనకాపల్లి పట్టణంలోని సామాజిక వన విభాగం, డివిజనల్ ఫారెస్ట్ అధికారి వారి కార్యాలయంలో ఆదివారం ఉదయం అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డివిజనల్ ఫారెస్ట్ అధికారి గంపా లక్ష్మణ్ అమరవీరుల వివరాలు కలిగిన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1939 నుంచి నేటీ వరకు ఎంతో మంది అటవీ అధికారులు వారి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అమరులయ్యారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని నాలుగు రేంజ్‌ల అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీరిద్దరి సేవకు గుర్తింపు లేదా...!

గవిరెడ్డి, పైలా అభిమానుల ఆవేదన

విశాలాంధ్ర - కె.కోటపాడు: పార్టీ అంటే ప్రాణం పెట్టే వారికి, కష్ట కాలంలో అండగా నిలబడ్డ వారికి, వైసీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, దాడులు, అరెస్టులకు భయపడకుండా వీరోచితంగా పోరాడిన వారికి పార్టీ పదవులు ఇచ్చినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్భాటంగా ప్రకటించారు. మాడుగుల నియోజకవర్గంలో మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు చేసిన దాడులకు, అరెస్టులకు దీటుగా నిలబడ్డ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావుల సేవలు పార్టీ మర్చిపోవడం బాధాకరమే అని అభిమానులు ఆవేదన చెందుతున్నారు. పార్టీ విడుదల చేసిన మొదటి జాబితాలో ఏదో ఒక పదవి ఉంటుందని భావించారు. ఇక రెండో జాబితా 62 పోస్టుల్లో మిత్రపక్షాలైన జనసేనకు 10 భాజపాకు మూడు కేటాయించింది. మిగిలినవి పార్టీ జెండానే దైవంగా భావించి, ఐదేళ్ల వైసీపీ అరాచకాన్ని ఎదుర్కొన్న నేతలకు పోస్టులు కేటాయించామన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు వరుసగా రెండుసార్లు ఓటమిపాలైనా.. మాడుగులను వదిలిపెట్టకుండా కార్యకర్తలకు అండగా నిలబడి పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. ఎక్కడ ఏ కార్యకర్తకు ఆపద వచ్చిన నేనున్నాను అంటూ వారిలో ధైర్యం నింపేవారు. ఇప్పటికీ గవిరెడ్డికి కార్యకర్తల బలం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. ఇక పైల ప్రసాద్‌రావు గత 15 సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాలు చురుకుగా నిర్వహిస్తూ ఉన్నారు. 2023లో కార్యకర్తల సంక్షేమ నిధికి కోటి రూపాయలు విరాళం అందించారు. అంతకుముందు సంవత్సరం కూడా 25 లక్షలు పార్టీకి విరాళం అందించారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలకు ఆర్థిక సహాయం అందజేసి మంచి పేరు సంపాదించుకున్నారు. వైసీపీ పెట్టిన అక్రమ కేసులలో జైలుకు కూడా వెళ్లారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాడుగుల అభ్యర్థిగా ప్రకటించి తిరిగి రద్దు చేయడంతో మానసికంగా ఇబ్బంది పడ్డా... బండారు సత్యనారాయణమూర్తి గెలుపునకు సహకరించారు. ఇటువంటి సేవ చేసిన ఇద్దరు నాయకులను పార్టీ విస్మరించడం భావ్యం కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇద్దరికీ గౌరవప్రదమైన పదవులు కట్టబెట్టాలని కార్యకర్తలు ఆశగా అభ్యర్థిస్తున్నారు.

అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను నెం.1గా తీర్చిదిద్దుతాం

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ సీఎం రమేష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను నెంబర్ వన్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతానని అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. ఆదివారం రైల్వే స్టేషన్‌ను సందర్శించి, నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యాలలో ఒకటైన వికసిత్ భారత్‌లో భాగంగా దేశంలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్లను ఎయిర్ పోర్టు మాదిరిగా మోడరైజేషన్ చేస్తున్నామన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌కు 500 కోట్ల రూపాయలతో ఆధునీకరణ చేపట్టమని తెలిపారు. రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లి పార్లమెంట్ సభ్యునిగా జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధానమైన అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రామాణికంగా పనిచేస్తున్నామన్నారు. ముఖ్యంగా మహిళలకు, వికలాంగులకు, చిన్న పిల్లలకు స్టేషన్లో ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా చేయడమే లక్ష్యం పెట్టుకున్నామన్నారు. స్టేషన్ విస్తరణ, కావలసిన సదుపాయాలు ప్రధాన ముఖద్వారంతో పాటుగా రెండవ ముఖ ద్వారమును అభివృద్ధి చేస్తాం అన్నారు. అన్నీ రైల్వే స్టేషన్లలో కేవలం ప్రయాణికులమ మాత్రమే అనుమతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండు రోజుల్లో అధికారులుతో సమీక్షాలు నిర్వహించి స్టేషన్‌లో అన్ని అభివృద్ధి పనులను 6 నెలల్లోనే పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. స్థానిక రైతులు గతంలో ఉపయోగించుకునే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తక్షణమే పునః ప్రారంభించేలా అధికారులకు ఆదేశిస్తామన్నారు. కొన్ని సంఘ విద్రోహశక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతు న్నారని తెలిసిందని దానికి ప్రత్యామ్నాయంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని రైల్వే స్టేషన్లలో ఎంపీ నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. అనకాపల్లి స్టేషన్లో పార్సిల్ ఆఫీస్ మూసి వేస్తారని తెలియగానే వెంటనే జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లామని దేశంలో ఉన్న బోర్డు నిర్ణయం అని తెలపగా గతంలో మాదిరి యధావిధిగా కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని తెలియజేశామన్నారు. పట్టణంలో ఎన్నో ఏళ్లగా ఉన్న సమస్య ఫ్లైఓవర్ బ్రిడ్జి గురించి ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో పనులు పూర్తి చేయకుండా విస్మరించారని, త్వరలోనే ఏడున్నర కోట్ల రూపాయలు కాంపోజిషన్ నిధులను కలెక్టర్‌కు డిపాజిట్ చేస్తామని తెలియజేశారు. ఆయన వెంట దాని రత్నాకరు, బిజెపి నాయకులు ఉన్నారు.

గ్రామీణ వ్యవస్థ నుంచే క్రీడాభివృద్ధి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్.జి.ఎఫ్. బాలబాలికల హాకీ పోటీలు నిర్వహించడమే కాకుండా సమిష్టి కృషితో చాలా చక్కగా నిర్వహించిన ఈ హాకీ పోటీలు ఈ ప్రాంతానికి వన్నె తెచ్చేలా ఉన్నాయని రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్, రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. ఈ సందర్భంగా శివ దత్ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటలు కూడా జీవితంలో ఒక భాగమై ఉండాలని బాగా చదువుకున్న క్రీడాకారులు జ్ఞానం పొందుతారని అన్నారు. క్రీడల్లో రాణించే క్రీడాకారులు మానసికంగా, ఆరోగ్యమైన జీవితం గడపగలరని అన్నారు. ఈ సందర్భంగా క్రీడాప్రాగణంలో హాకీ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధికి పవన్ కళ్యాణ్ కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - నాతవరం: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద గొలుగొండపేట గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఆవిష్కరించి మాట్లాడారు. గడచిన ఎన్నికల్లో జనసేన ప్రభంజనం చూసామన్నారు. గ్రామ గ్రామాన జనసేన పార్టీ బలోపేతమైందని, ఇంకా పార్టీని ముందుకు తీసుకువెళ్తామన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీ కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి గ్రామాల అభివృద్ధి మీద దృష్టి సారించారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, నాతవరం మండలం జనసేన అధ్యక్షుడు వెలగల వెంకట రమణ, గ్రామ టీడీపీ నాయకులు చిట్టిబాబు, జనసేన యువ నాయకుడు బైన మురళి, ప్రగడ కృష్ణ, పైల రమణ, దోమల మణికంఠ, లంక సతీష్, బాలరాజు పాల్గొన్నారు.

రేషన్ బండి రాదు.. సరుకులు ఇవ్వరు...

విశాలాంధ్ర - చోడవరం: ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాలు గతంలో మాదిరి రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంటింటికీ రేషన్ పథకంలో భాగంగా గతంలో వై.సి.పి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాలు ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా వుండేవని గ్రామస్తులు చెబుతున్నారు. గంటలు తరబడి కాలయాపన, రేషన్ సరుకులు లేవను మాట లేకుండా, ప్రతీ ఒక్కరికీ ఉపయోగపడే విధంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ వంపిణీ వాహనాలు గ్రామాల్లోకి రావడం క్రమంగా తగ్గుముఖం పడతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ రేషన్ ఇచ్చే వాహనం వచ్చినా ప్రజలకు అవసరమైన సరుకులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న పివిజి.కుమార్

విశాలాంధ్ర - వి.మాడుగుల: రాష్ట్ర కొప్పల వెలమ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పివిజి.కుమార్ దంపతులు ఆదివారం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు శ్రీనాథు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు, ఉందూరు దేముదు, నందారపు సన్యాసిరావు, వడ్డాది రంజిత్ వర్మతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు ఫ్యాన్లు వితరణ

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం కింతలి బిసి హాస్టల్‌కు కింతలి వల్లాపురం జనసేన యూత్ ఆధ్వర్యంలో మైచర్ల అర్జున్ గణపతినాయుడు, దామరౌతు అశోక్ చేతుల మీదగా నాలుగు ఫ్యాన్లను ఆదివారం హాస్టల్ వార్డెన్ రాజునాయుడుకు అందించారు. ఈ కార్యక్రమంలో కింతలి సర్పంచ్ మైచర్ల సన్యాసిరావు, జనసేన మండల కార్యదర్శి రెడ్డి సాయి, కొన భీమేశ్వరరావు. అప్పాన్న నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులతో రేవు పోలవరం

విశాలాంధ్ర - యస్.రాయవరం: కార్తీక మాసం ఆదివారం కావడంతో మండలంలోని సముద్ర తీర ప్రాంతమైన రేవు పోలవరం పర్యాటకులతో కిటకిటలాడింది. ఎలమంచిలి, నర్సీపట్నం, కోటవురట్ల, నక్కపల్లి తదితర దూర ప్రాంతాల పర్యాటకులు సముద్ర తీరం వద్దకు వచ్చి దగ్గర్లో ఉన్న కొబ్బరి జీడి మామిడి తోటల్లో గ్రూపులు గ్రూపులుగా భోజనాలు చేశారు. అనంతరం దగ్గరలో ఉన్న సముద్రంలోని పర్యాటకులు స్నానాలు చేసి సందడి చేశారు. ఇలాంటి ప్రదేశంకు రావడం ఎంతో సంతోషంగా ఉందని పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు. పర్యాటకుల దృష్టిలో ఉంచుకొని స్థానిక పోలీసులతో పాటు మెరైన్ పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

కర్రి సాయికృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక గ్రామంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయి కృష్ణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం జరిగింది. సభ్యత్వం తీసుకుంటే దానివల్ల కలిగే లాభాల్ని ప్రజలకు వివరిస్తూ మునగపాక పల్లపు వీధి, మెయిన్ రోడ్, సంత బయలు ప్రాంతాల్లో సభ్యత్వాలు చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షులు దాడి శివ, గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి పెంటకోట శ్రీరామ్ మూర్తి, కాంద్రేగుల పరదేశి నాయుడు, విల్లూరి నర్సింగరావు, భీమ్ నాయుడు, వేగి దేవత నాయుడు, విల్లూరి సాయిరాం, వెలగా మురలి, సూరిశెట్టి అప్పల నాయుడు పాల్గొన్నారు.

కైట్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

విశాలంధ్ర - అచ్యుతాపురం: స్థానిక కైట్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు. కైట్స్‌లో చదివి జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. కాలేజ్ తరుపున మేనేజ్‌మెంటు వారు అందించిన పదివేల రూపాయల చెక్కును విద్యార్థులు తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా కైట్స్ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవిని, అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రపు విమల వెంకునాయుడు, జనసేన నాయకులు ద్వారపురెడ్డి బాబ్జి, జనపరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, కైట్స్ కరెస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, కైట్స్ డైరెక్టర్, కైట్స్ స్కూల్ కరెస్పాండెంట్ రెడ్డి గణేష్, డైరెక్టర్స్ విల్లూరి ప్రసాద్, అడిగర్ల శంకరరావు, కైట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ రెడ్డి ప్రసన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుందరపును కలిసిన చైర్మన్ ప్రగడ

విశాలంధ్ర - అచ్యుతాపురం: ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను ఆయన నివాసంలో ఆదివారం రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను శాలువతో ప్రగడ నాగేశ్వరరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిఎన్‌టియుసి ప్రదాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో ఆగని అక్రమ నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - పరవాడ: జీవీఎంసీ 85వ వార్డు పరిధి లంకెలపాలెంలో అనధికార నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. కొందరు అడ్డగోలుగా అనుమతులు లేని నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టనట్లు వ్యవ హరిస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని రెడ్ చెర్రీ ఎదురుగా ఓ అనధికార నిర్మాణం జరుగుతుండగా.. సబ్బవరం వెళ్లే మార్గంలో చేపల దుకాణం ఆనుకుని మరికొన్ని అనధికార షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ కార్యాల యం ఎదురుగా బహిరంగంగానే ఈ నిర్మాణాలు చకచకా జరిగిపో తున్నాయి. కొందరు వ్యాపారులు యుద్ధ ప్రాతిపదికన షెడ్ల నిర్మాణం చేపట్టి అద్దెలకిస్తున్నారు. ఓ పక్క నిర్మాణం జరుపుతూనే మరో పక్క సున్నాలు వేస్తున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నలలోనే సాగుతున్నట్లు విమర్శలు కూడా లేకపోలేదు. పైగా అడ్డగోలు అక్రమ నిర్మాణాలతో ఇక్కడ ట్రాఫిక్ అంతరాయం కూడా ఏర్పడుతోంది. గతంలో ఇదే పరిస్థితి తలెత్తడంతో అధికారులు అప్పట్లో ఇక్కడ రోడ్డు పక్కన కొన్ని షెడ్లను తొలగించారు. తిరిగి అదే ప్రాంతంలో ప్రస్తుతం నిర్మాణాలు వెలుస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే మామూళ్ల మత్తులో పడి అధికారులు వీటిని పట్టించుకోలేదన్న విమర్శలు కూడా వ్యక్త మవుతున్నాయి. ఈ అనధికార నిర్మాణాలపై ఆది నుంచి ఫిర్యాదులు ఉన్నప్పటికీ ఇటు ప్లానింగ్ సెక్రెటరీలు గాని అటు టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ ఎటువంటి చర్యలు తీసుకో కపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీయ ఒత్తిడో లేక ఆమ్యామ్యాల ప్రభావమో కానీ జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారుల చర్యలు ఏమాత్రం కనిపించలేదు. ఇప్ప టికైనా టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు స్పందించి ఈ అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి హాకీ క్రీడలు

విశాలాంధ్ర - నక్కపల్లి: మండల కేంద్రంలో ఎస్.జి ఎఫ్. రాష్ట్ర స్థాయి అండర్ 14 బాల బాలికల హాకీ పోటీల్లో ప్రధమ స్థానాన్ని కడప విజయం సాధించింది. బాలురు విభాగంలో విశాఖపట్నం విజయం సాధించిందని ఎస్.జి.ఫ్ జిల్లా సెక్రటరీ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో విజయం సాధించిన విజేతలకు గ్రామ సర్పంచ్ నేతల జయరత్న కుమారి, వైసీపీ రాష్ట్ర నాయకులు వీసం రామకృష్ణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపిపి వీసం నానాజీ, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కోసూరు శ్రీనివాసరావు చేతులు మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా సెక్రటరీ నాగేశ్వరావు మాట్లాడుతూ నక్కపల్లి బియస్ హాకీ క్లబ్ ఆర్గనైజేషన్‌లో ఎంతో చక్కగా ఎక్కడ ఎలాంటి అవంతరాలు లేకుండా ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ రాష్ట్ర పోటీల్లో మంచి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 8 నుండి 13 వరకు మధ్య ప్రదేశ్‌లోని మాండిసోరి గ్రామ ంలో జరగబోయే జాతీయ హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులును బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కోచ్ రాంబాబు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, జాతీయ సీనియర్ క్రీడాకారుడు గాజుల రాంబాబు, వైస్ సర్పంచ్ వీసం రాజు, స్టేట్ అబ్జర్వర్ థామస్, ఎంఈఓ 1 నరేష్, ఎంఈఓ 2 వేమగిరి నూకరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పిఈటి అసోసియేషన్ సెక్రటరీ కె.ఎం.నాయుడు, ఎన్ఎన్ శర్మ, సి.హెచ్. వెంకటరావు, కొల్నాటి నానాజీ, రమణ, పి.శ్రీను, ప్రశాంత్, రమేష్, టి.అప్పారావు, ముద్దా శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు.

ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

విశాలాంధ్ర - అనకాపల్లి: ఉత్తరాంధ్ర కరువు, వలసలు-విద్య, ఉపాధిరంగ సమస్యలు-కర్తవ్యాలు" అనే అంశంపై జరిగే "ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు"ను, విద్యార్థి, యువకులు, మేధావులు విజయవంతం చేయాలని స్థానిక ఎస్సీ హాస్టల్ వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్ ను పిడిఎస్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి అన్ని పాలకవర్గ పార్టీలు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం కోసం ఆంధ్రప్రదేశ్లోని ఉత్తరాంధ్రను కావాలని అభివృద్ధి చేయని కారణంగానే వలసలు అధికమవుతున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం అమలు చేయాల్సిన విభజన హామీలను వేటిని కూడా అమలు చేయలేదన్నారు. విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్రకు కేటాయించిన విశాఖ రైల్వే జోన్‌ను, సెంట్రల్ యూనివర్సిటీని, విద్యాసంస్థలకు నిధుల కేటాయింపు వంటి హామీలను అమలు చేయాలని, మూతపడ్డ జూట్, చక్కెర తదితర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెరిపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే విరమించి సొంత గనులను కేటాయించాలని, ప్రైవేటీకరించిన ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వమే కొనసాగించాలని, ఉత్తరాంధ్రలో విచ్చలవిడిగా యువతకు అందుబాటులో ఉంటున్న గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలని, వలసలను అరికట్టి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయనగరంలో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సుకు ప్రారంభకులుగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డా. డి.వి.జి. శంకరరావు, ముఖ్యఅతిథిగా ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, వక్తలుగా కేంద్ర-రాష్ట్ర మాజీ సలహాదారు వై.వి.ఎస్. మహదేవన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి తదితరులు పాల్గొని, ప్రసంగిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా కమిటీ సభ్యులు కె.చందు, ఎస్.గణేష్ పి.ఉదయ్ కిరణ్, ఓ.మహేష్,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

నాటి విద్యార్థులు నేడు కలిసిన వేళ....

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1992-94 మధ్య కాలంలో ఇంటర్మీడియట్ చదివిన నాటి విద్యార్థులు సుమారు 3 దశాబ్దాల తర్వాత నేడు ఆదివారం మళ్ళీ కలిశారు. నాటి మిత్రులు చౌడువాడలో కలసి, అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఉద్యోగ, వ్యాపారాల దృష్ట్యా ఎక్కడెక్కడో స్థిరపడ్డ వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మరోసారి వయసు మరచి విద్యార్థులుగా మారిపోయి ఆటపాటలతో రోజంతా ఉత్సాహంగా గడిపారు. నాటి అధ్యాపకులు కామిరెడ్డి అప్పారావు (ప్రిన్సిపాల్), శ్రీనివాసరావు(కామర్స్), తిరుపతిరావు(ఇంగ్లీష్),రామారావు (సివిక్స్)మాస్టార్లను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు లోవరాజు, సత్య, తదితరులు పాల్గొన్నారు.

తామరం ఇన్‌చార్జి వీఆర్‌ఓగా సాంబశివరావు

విశాలాంధ్ర - మాకవరపాలెం: రాచపల్లి వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న గోగులపాటి సాంబశివరావుకు తామరం ఇన్‌చార్జి వీఆర్‌ఓగా బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు తామరం వీఆర్వోగా పని చేసిన లక్ష్మణరావు రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో తామరం పంచాయతీకి ఇన్‌చార్జి వీఆర్‌ఓగా సాంబశివరావుని నియమిస్తున్నట్లు తహశీల్దార్ రామారావు తెలిపారు.

పీపీ అగ్రహారంలో లక్ష బిల్వార్చన

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని పిపి అగ్రహారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఉమా అమృతేశ్వర స్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గత 19 సంవత్సరాలుగా కొమ్మోజు కృష్ణ, కేతవరపు బుచ్చు బాబు, దాతల సహకారంతో వచ్చిన కొంత నగదుతో ఈ కార్యక్రమాన్ని జరుపుతున్నారు.

నాతవరంలో జోరుగా టీడీపీ సభ్యత్వాలు

విశాలాంధ్ర - నాతవరం: మండల కేంద్రంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో జోరుగా సభ్యత్వాలు నమోదు జరిగింది. ఈ సందర్భంగా తెలుగు యువత నాయకుడు శెట్టి లోవ మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందడం ద్వారా భీమా సదుపాయం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా మండల కేంద్రం 83, 89వ బూత్ నందు అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు జరిగిందని తెలిపారు. మండలంలో కూడా యువత ముందుకు వచ్చి సభ్యత్వాలు నమోదు చేయాలని కోరారు.

తిమ్మాపురంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో తిమ్మాపురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ కుసుమ కావ్య ఫౌండేషన్ సహకారంతో శానాపతి బాబురావు మాష్టారు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీవిద్య పబ్లిక్ స్కూల్ వద్ద మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్, కేర్ హాస్పిటల్ వారితో మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, స్త్రీలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారం పరీక్షలు జరిపారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుభద్ర, సుగుణ, డాక్టర్ సాయిరామ్ పర్యవేక్షణలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రసాదుల గణేష్, శానాపతి పరుశురామ్, అప్పికొండ బుజ్జి, కోన దుర్గాప్రసాద్, వంగలపూడి నానాజీ, తోకాడ అప్పారావు, ప్రగడ అంజి, శానాపతి వెంకటేష్, సూరకాసుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.